సాక్షి
కుమురం భీం
సోమవారం ׀ 22 ׀ జనవరి ׀ 2024



## న్యూస్‌రీల్

### 23న జంగుబాయి క్షేత్రానికి మంత్రి సీతక్క



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో కెరమెరి మండలం ముకదం గూడ పంచాయతీ పరిధిలోని మహరాజ్ గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి పుణ్యక్షేత్రాన్ని ఈ నెల 23న ఉదయం 8 గంటలకు రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) దర్శించుకుంటారని ఆలయ కమిటీ చైర్మన్ కొడప జాకు తెలిపారు. ఈ నెల 25న జంగుబాయి ఆలయంలో నిర్వహించే మహా పూజ పోస్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్కతోపాటు ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా అధికారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మరప బాజీరావు, శ్యాంరావు, దౌలత్‌రావు, ఆర్‌ఎస్ జంగు తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తు గడువు పొడిగింపు

ఆసిఫాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈనెల 20 నుంచి 23 వరకు పొడిగించినట్లు జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

### సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బాలరాజు

కాగజ్‌నగర్‌రూరల్: దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న తలపెట్టిన పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, రైతుల జీవితాలు, జీవనోపాధిపై నిరంతరాయంగా కేంద్ర ప్రభుత్వం అనాగరిక దాడులు చేస్తుందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ.. రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షుడు మధుకర్, జిల్లా కార్యదర్శి మొగిలి, కోశాధికారి దుర్గం వెంకటేశ్, నాయకులు జంగు, సురేశ్, రాజు, రాజన్న, ముస్తాక్, శ్రీనివాస్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

### రేపు కోర్ కమిటీ సమావేశం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ కోర్ కమిటీ సమావేశాన్ని ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పాయల్ శంకర్ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పార్లమెంటరీ పరిధిలోని బీజేపీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే, ఎంపీలు, కోర్ కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు.

# అంతా రామమయం..!

- అయోధ్య ఆలయ ప్రారంభోత్సవంతో జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం
- పల్లెలు, పట్టణాల్లో శ్రీరామ నామ జపం
- ఇప్పటికే ఇంటింటికీ రాములోరి అక్షింతలు పంపిణీ
- జిల్లాలోనూ చరిత్ర కలిగిన రామాలయాలు
- విద్యుత్ వెలుగులు, పూలతో అలంకరించిన భక్తులు
- నేడు ప్రత్యేక పూజా కార్యక్రమాలు



జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలో సీతారాములు

ఆసిఫాబాద్: అంతా రామమయం.. జగమంతా రామమయం.. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. శ్రీరామ నామస్మరణ మార్మోగుతోంది. అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా రామజన్మ భూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాకు వచ్చిన అక్షింతల పంపిణీ ఇప్పటికే పూర్తయింది. జిల్లాలోని రామాలయాలతోపాటు ఇతర ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**ప్రత్యేక కార్యక్రమాలు**

జన్కాపూర్ కోదండ రామాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. సోమవారం ఉదయం 5 గంటలకు స్వామి వారికి అభిషేకం, 9 గంటలకు హోమం, 10.30 గంటలకు రామనామ సంకీర్తన, 11.20 గంటలకు పురోహితులు సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రవచనం, అనంతరం అష్టోత్తరం, అలంకరణ, అఖండ రామజపం, మహా మంగళహారతి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పల్లకి సేవ, 6 గంటలకు సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా.. ఆదివారం రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో రామాలయంలో శ్రీరాముడిపై కవితలు, భక్తిపాటలతో పాటు అర్చకులు ఇందారపు మధుకరశర్మ ఆధర్వర్యంలో శ్రీరాముడి గుణగణాలపై చేసిన ప్రవచనం ఆకట్టుకుంది. భక్తులకు శ్రీరాముడి అక్షింతలు, కాషాయ జెండా బహూకరించారు. కార్యక్రమంలో ఆకసం ప్రతినిధులు గుర్రాల వెంకటేశ్వర్లు, నారాయణ మూర్తి, రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ ప్రతినిధులు కోటేశ్వర్‌రావు, వేణుగోపాల్, శ్రీనివాస్, రవి, గిరి, కమిటీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని వాసవీ మందిర్, సాయి మందిర్, సత్యసాయి సదన్‌తోపాటు ప్రధాన ఆలయాల్లో ప్రతిరోజూ రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

### జిల్లాకే తలమానికం జానకీపురం..



జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయం

జిల్లా కేంద్రంలోని జానకీపురం(జన్కాపూర్) కోదండ రామాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. కాకతీయుల దీక్షాదక్షతలకు గుర్తుగా ఎనిమిది దశాబ్దాలుగా జన్కాపూర్ కోదండ రాముడికి పూజలు నిర్వహిస్తున్నారు. నాటి త్రికుటాలయం శిథిలం కాగా.. ఒకప్పటి జనగామ, ప్రస్తుత ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన స్వర్గీయ రాంచందర్‌రావు పైకాజీ 1970లో మళ్లీ ఆలయాన్ని నిర్మించారు. సీతారాముల విగ్రహాలు ప్రతిష్ఠించారు. తొలుత నిర్మించిన ఆలయం కూడా శిథిలమవడంతో ఇరవై ఏళ్ల క్రితం భక్తుల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టారు. శివలింగం, షిర్డీ సాయినాథుడి విగ్రహాలతోపాటు ఈశాన్యంలో నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించారు.

### తిర్యాణిలో రామాలయం



తిర్యాణిలోని రామాలయం

తిర్యాణి(ఆసిఫాబాద్): తిర్యాణి మండల కేంద్రంలోని రామాలయానికి 50 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. గతంలో ఇక్కడ చిన్న షెడ్డు ఉండగా.. ఎనిమిదేళ్ల క్రితం దాతల సహకారంతో ఆలయం నిర్మించారు. ఏటా శ్రీరామ నవమికి ఇక్కడ నిర్వహించే జాతరకు గిరిజన ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.

### కార్మికుల జీతాల నుంచి.. ప్రతినెలా చందా



ముస్తాబైన గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయం

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటిటౌన్ షిప్‌లోని శ్రీకోదండ రామాలయం 1988లో సింగరేణి కార్మికులు, ప్రజల చందాలతో ఏర్పాటు ప్రారంభమైంది. 1988లో చిన్న షెడ్డు ఏర్పాటు చేసి సీతారాములు, ఆంజనేయస్వామి మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా సింగరేణి కార్మికులు, అధికారులు, దుబ్బగూడ, భగత్ సింగ్ నగర్ ప్రాంతాల్లోని ప్రజలు అందించే చందాలు, విరాళాలతో స్వామి వారి కల్యాణ మహోత్సవం చేసేవారు. సింగరేణి యాజమాన్యం సహకారం, అధికారులు, కార్మికుల ప్రజల కృషితో 1992లో శాశ్వత ఆలయ నిర్మాణం పూర్తి చేసి మట్టి విగ్రహాల స్థానంలో నల్లరాతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. 2015 నుంచి బెల్లంపల్లి ఏరియాలో పనిచేసే ప్రతి సింగరేణి కార్మికుడు జీతం నుంచి ప్రతినెలా చందా రూపంలో ఆలయానికి విరాళంగా అందిస్తున్నారు. రూ.10తో ప్రారంభమైన ఈ చందా ప్రస్తుతం రూ.50కి చేరింది. డోర్లి ఉద్యోగులు అందించిన రూ.1.33లక్షల విరాళంతో ఆలయ పరిసరాల్లో నల్లరాతితో పూర్తిస్థాయిలో ఫ్లోరింగ్ చేశారు. దసరా రోజు ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర, రావణ దహన కార్యక్రమాలను అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని కోదండ రామాలయంలో స్వామి వారి పాదుకలకు అభిషేకం నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఆలయాన్ని కాషాయ జెండాలతో ముస్తాబు చేశారు.

### హనుమాన్ భక్తుడి.. కోదండ రామాలయం



రెబ్బెనలోని సీతారామాంజనేయస్వామి ఆలయం

రెబ్బెన(ఆసిఫాబాద్): స్వతహాగా హనుమాన్ భక్తుడు. రాముడి ఆలయ నిర్మాణానికి ఏకంగా రూ.32 లక్షల విరాళం అందించి భక్తిభావాన్ని చాటుకున్నాడు. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన పరమేశ్వర్ లాల్ జైస్వాల్, చెమిలిదేవికి సంతానం లేకపోవడంతో భార్యభర్తలిద్దరూ ఆధ్యాత్మిక చింతనలో గడిపేవారు. వృద్ధాప్యంతో చెమిలిదేవి మృతి చెందగా పరమేశ్వర్‌లాల్ జైస్వాల్ ఒక్కరే మిగిలారు. నమ్ముకున్న హనుమంతుడి దైవారాధనతో కాలాన్ని వెల్లదీస్తున్న క్రమంలో మండల కేంద్రంలో కోదండ రామాలయ నిర్మాణం చేపట్టాలని స్థానిక భక్తులు భావించారు. విషయం తెలుసుకున్న పరమేశ్వర్‌లాల్ ఆలయ నిర్మాణానికి కావాల్సిన నిధులను ఒక్కడే సమకూర్చేందుకు ముందుకు వచ్చాడు. తన వద్ద ఉన్న రూ.32 లక్షలు విరాళంగా అందించాడు. స్వామి వారి పట్ల ఉన్న భక్తి భావాన్ని చాటుకున్నాడు. ఆలయ నిర్మాణం పూర్తయిన కొన్నాళ్లకే పరమేశ్వర్‌లాల్ కాలం చేయడంతో ఆలయం ఎదుట దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. 2013లో ఆలయ నిర్మాణం పూర్తయింది. సోమవారం మండల కేంద్రంలోని రామాలయంలో స్వామి వారి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

### రైల్వేకాలనీలో రాముడు



ఆలయంలో సీతారాములు

కాగజ్‌నగర్‌రూరల్: పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వేకాలనీలో 75 ఏళ్ల క్రితమే శ్రీరాముడు కొలువుదీరాడు. కాలనీవాసులు కష్టపడి శ్రీరామాలయాన్ని నిర్మించుకున్నారు. ఈ ఆలయంలో ఇప్పటివరకు 76 కల్యాణోత్సవాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు, బుర్రకథలు, అన్నదాన కార్యక్రమాలు చేపడుతుంటారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

- ఎంపీ సోయం బాపూరావు



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మండలంలోని సారసాల గ్రామంలో ఆదివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీశ్ బాబుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు.

**పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి**

పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పద్మశాలి భవన్ పనులను ఆదివారం ప్రారంభించారు. సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వసతిగృహాలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, నాయకులు గోలెం వెంకటేశం, పుల్ల అశోక్, దోని శ్రీశైలం, టీజీబీ మేనేజర్ సాయిచరణ్, సిందం శ్రీనివాస్, రాజమౌళి, మౌనిక, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి బాటలో..

- గంగాజలం సేకరణ కోసం..
- మెస్రం వంశీయుల పాదయాత్ర షురూ
- ఈనెల 28న హస్తిన మడుగుకు..



గంగాజలం సేకరణకు కాలినడకన వెళ్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపు ఉంది. పుష్యమాస అమవాస్య పురస్కరించుకొని కేస్లాపూర్‌లో నిర్వహించే జాతరలో భాగంగా ప్రధాన ఘట్టం మొదలైంది. మహాపూజకు అవసరమయ్యే పవిత్ర గంగాజలం కోసం మెస్రం వంశీయులు ఆదివారం బయల్దేరి వెళ్లారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మెస్రం వంశీయులు కేస్లాపూర్‌కు చేరుకొని ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో ఉదయం సమావేశమయ్యారు. గంగాజల సేకరణ పాదయాత్ర, మహాపూజ నిర్వహణపై చర్చించారు. ఝరి(కలశం)దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగాజల సేకరణ పాదయాత్ర ప్రారంభించారు. మెస్రం వంశ అల్లుళ్లు, ఆడపడుచులు బుందో పట్టగా.. వంశీయులు కానుకలు వేసి ముందుకు సాగారు. యాత్ర తొలిరోజు మండలంలోని కేస్లాగూడకు చేరుకుని అక్కడే బస చేశారు. ఈనెల 22న నార్నూర్ మండలంలోని గుంజాల, 23న నాగల్‌కొండ, 24న జైనూర్ మండలంలోని గౌరి, 25న లింగాపూర్ మండలంలోని గుంనూర్, 26న జన్నారం మండలంలోని ఇస్లాంపూర్, 27న దస్తురాబాద్ మండలంలోని మల్లేపూర్ వద్ద బస చేస్తూ వెళ్తుంటారు. ఈ నెల 28న మంచిర్యాల జిల్లా జన్నారం మండలం గోదావరి నది హస్తిన మడుగుకు చేరుకుంటారు. ప్రత్యేక పూజలు చేసి పవిత్ర గంగాజలం సేకరిస్తారు. అదే రోజు తిరుగు ప్రయణమవుతారు. గంగాజలంతో బయల్దేరి ఉట్నూర్ మీదుగా వచ్చి ఫిబ్రవరి 5న ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుంటారు. ప్రత్యేక పూజల అనంతరం అదే రోజు సాయంత్రం కేస్లాపూర్ సమీపంలో మర్రిచెట్టు (వడమర) వద్ద బస చేస్తారు. ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు సంప్రదాయ, తూమ్(ఖర్మకాండ) పూజలు చేయనున్నారు. 9న రాత్రి 10:30 గంటల సమయంలో పవిత్ర గంగాజలంతో మహాపూజ నిర్వహించి నాగోబా జాతర ప్రారంభించనున్నట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశం పెద్దలు చిన్ను, బాదిరావ్, కోసేరావ్, ఆనంద్‌రావ్, ప్రధాన్ పెద్దలు దాదారావ్, వంశ ఉద్యోగులు సోనేరావ్, మనోహర్, శేఖర్‌బాబు,దేవ్‌రావ్ తదితరులున్నారు.

**యాత్ర విజయవంతం చేయాలి**

గంగాజలం సేకరణ యాత్రలో పాల్గొంటున్న మెస్రం వంశీయులు నిష్ఠతో, భక్తి శ్రద్ధలతో ఉండాలని పటేల్ వెంకట్‌రావ్ అన్నారు. యాత్రలో పాల్గొనే వారికి సలహాలు, సూచలు అందించారు. మార్గమధ్యలో బంధువుల ఇళ్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించారు. వంశ పెద్దల నిర్ణయాలకు కట్టుబడి ఉంటూ యాత్ర విజయవంతం చేయాలన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

- డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్
- సర్కేపల్లిలో అటవీ సంరక్షణపై అవగాహన
- పరిహారం చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, తదితరులు

వాంకిడి(ఆసిఫాబాద్): వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. వాంకిడి మండలం సర్కేపల్లిలో ఆదివారం అటవీ- వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ అడవుల రక్షణలో పులుల ప్రాముఖ్యత ఎక్కువ ఉంటుందన్నారు. అడవుల సమీపంలో నివసించే ప్రజలు, రైతులు వన్యమృగాలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమకు సమాచారం అందించాలని కోరారు. పశువులపై దాడులు జరిగిన సమయాల్లో క్షణికావేశాలకు లోనై తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. జంతువులను వేటాడటం, పంట పొలాలకు రక్షణగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం, పులులపై విష ప్రయోగం, చెట్లు నరకడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. పులిదాడిలో పశువులు మృతి చెందితే తక్షణ సాయం కింద రూ.5 వేలు, వారం రోజుల్లో పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. పులుల దాడిలో వ్యక్తులు మృతి చెందితే బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం అందుతుందని, గాయాలపాలైతే మెడికల్ బిల్లుల ఆధారంగా నగదు చెల్లిస్తామని తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని కోరారు. ఇటీవల పులిదాడిలో మృతి చెందిన ఆవుల యజమానులు రింగారేట్‌కు చెందిన కోవ రాజుకు రూ.22000, సర్కేపల్లికి చెందిన కుంరం భీంరావుకు రూ.18000, సోనాపూర్‌కు చెందిన సిడాం కన్నుకు రూ.18000 పరిహారం చెక్కులు ఎంపీపీ విమలాబాయితో కలిసి అందించారు.

**రహదారి నిర్మాణానికి అనుమతులివ్వాలి**

మూడేళ్ల క్రితం ఖమాన నుంచి సర్కేపల్లి వరకు బీటీ రోడ్డు మంజూరైనా అటవీశాఖ అనుమతులు లేక మూడు కి.మీ. మేర పనులు నిలిపివేశారని గ్రామ పటేల్ ఆత్రం జగనత్‌రావు డీఎఫ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఎఫ్‌వో రహదారికి సంబంధించిన ఫైల్‌ను అక్కడే పరిశీలించి వర్షాకాలానికి ముందుగానే అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు అందించారు. ఎఫ్‌ఆర్‌వో అప్పలకొండ, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, వెల్గి సర్పంచ్ మనోహర్ పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలి

- హైకోర్టు న్యాయమూర్తికి వినతి



మొక్క అందిస్తున్న జిల్లా జడ్జి, న్యాయవాదులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు భార్గవ్‌తో కలిసి స్థానిక న్యాయవాదులు జిల్లా పోర్ట్‌ఫోలియో హైకోర్టు న్యాయమూర్తి నందకు ఆదివారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు మాట్లాడుతూ సుమారు 100 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఆదిలాబాద్ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో వినియోగదారుల ఫోరం ఏర్పాటు చేయాలని, సిర్పూర్ కోర్టులో చాలా కేసులు పెండింగ్‌లో ఉండడంతో అక్కడ ఏడీజే జడ్జిని నియమించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో ఏడెకరాల భూమిలో 10 న్యాయస్థానాల భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. జిల్లాకు సంబంధించిన సమస్యలను హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో చర్చించి పరిష్కరిసార్తమని జిల్లా పోర్ట్‌ఫోలియో న్యాయమూర్తి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఫిబ్రవరి 3న జిల్లా కేంద్రానికి హైకోర్టు జడ్జి నందను ఆహ్వానించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరీశ్, రాపర్తి రవీందర్, చంద్రకుమార్, రామకృష్ణ, జాదవ్ గణేశ్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య



సరిత(ఫైల్)

మంచిర్యాలక్రైం: జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని జాఫర్ నగర్‌లో నివాసం ఉంటున్న సొదే సరిత (38)కు 18 ఏళ్ల క్రితం రవీందర్ అనే వ్యక్తితో వివాహమైంది. అప్పటి నుంచి సంతానం కలుగకపోవడంతో దంపతుల మధ్య గొడవలు తలెత్తాయి. విడాకులు తీసుకోవడంతో అప్పటి నుంచి సదరు మహిళ ఒంటరిగానే ఉంటోంది. దీంతో జీవితంపై విరక్తి చెందింది. ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు జోగేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### రామమందిర నిర్మాణం హర్షనీయం



కొమ్మెర లక్ష్మణ్

బెల్లంపల్లి: అయోధ్యలో రామమందిర నిర్మాణం హర్షనీయమని బెల్లంపల్లి నుంచి రామజన్మభూమి శిలాన్యాస కార్యక్రమానికి వెళ్లిన కొమ్మెర లక్ష్మణ్ అన్నారు. నాటి జ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు. 1992లో నిర్వహించిన రామజన్మభూమి శిలాన్యాస కార్యక్రమానికి బెల్లంపల్లి నుంచి 30 మంది బయలుదేరి వెళ్లాం. రైలులో అయోధ్యకు వెళ్తుండగా మార్గమధ్యలో నాగ్‌పూర్ వద్ద పోలీసులు అరెస్టు చేసి చండీఘర్‌లోని బెల్లంఘడ్ పోలీసు స్టేషన్‌లో రెండు రోజులు ఉంచారు. ఆ తర్వాత వదిలేశాక ఢిల్లీకి వెళ్లాం. ఢిల్లీలో ఇండియా గేట్ వద్ద మరోసారి పోలీసులు మమ్మల్నీ అరెస్టు చేసి కరోలబాగ్‌లోని సత్యనారాయణ స్వామి టెంపుల్‌లో ఓ రోజంతా ఉంచారు. రామజన్మభూమి శిలాన్యాస్ కోసం వెళ్లిన మేము రామమందిరం నిర్మాణం కావాలని ఎంతగానో ఆశించాం. ఇన్నాళ్లకు ఆ పుణ్యకార్యం పూర్తికావడం చాలా సంతోషాన్ని కలిగిస్తోంది. ఆ మహాకార్యంలో పాల్గొనే భాగ్యానికి నోచుకోక పోయినా అప్పటి అనుభవాలను గుర్తు చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని లక్ష్మణ్ పేర్కొన్నారు.

### రైస్‌మిల్లుల్లో ధాన్యం గోల్‌మాల్

- కోనసీమ నుంచి ఇందారానికి బియ్యం దిగుమతి



ఇందారం చేరిన ధాన్యం లారీలు

జైపూర్: రైస్ మిల్లుల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ అక్రమాలకు తెరలేపుతున్నారు. ఏటా ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ప్యాడీ కొనుగోలు కేంద్రాల ద్వారా రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయిస్తుండగా అట్టి ధాన్యాన్ని బియ్యంగా మార్చి విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వం రైస్ మిల్లుల ద్వారా రావాల్సిన కోటాపై సీరియస్‌గా దృష్టిపెట్టడంతో రైస్ మిల్లుల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల నుంచి ఏకంగా బియ్యాన్నే తెప్పించుకుంటున్నారు. జైపూర్ మండలం ఇందారంలోని మంజునాథ రైస్‌మిల్లు నిర్వాహకులు ఆదివారం రాత్రి ఏపీలోని కోనసీమ నుంచి నాలుగు లారీల్లో దొడ్డు బియ్యం దిగుమతి చేసుకున్నారు. వాటినే మార్చి ఎంఎల్ఎస్ పాయింట్‌కు అక్రమంగా తరలించనున్నారు. ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించకపోవడంతో నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు.



# హస్తం కసరత్తు..

- పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిపై కాంగ్రెస్ ఫోకస్
- ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంత ఓటర్లపై ప్రభావం చూపేలా
- బీఆర్ఎస్ ఓటు చీల్చితే విజయం దక్కుతుందనే విశ్వాసం



జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని నేతలు

సాక్షి, ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపడం ద్వారా విజయం సాధించాలని అధికార పార్టీ కాంగ్రెస్ భావిస్తోంది. పార్టీలో టికెట్ ఆశావాహులతో పాటు ఇతర రంగాల్లో, ప్రజల్లో పలుకుబడి ఉన్న గిరిజన నేతలపై దృష్టి సారించింది. దాంతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక ఎలా ఉంటుంది.. ఎవరైనా అసంతృప్త నేతల్లో వారికి ప్రజాదరణ ఉంటే అలాంటి అభ్యర్థులను కూడా పరిగణలోకి తీసుకోవాలని చూస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం మరోసారి జరిగింది. దీంట్లో నిర్మల్, కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాల అధ్యక్షులతో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, టికెట్ ఆశావాహులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

**ఓటర్లపై ప్రభావం చూపాలి..**

కాంగ్రెస్ ప్రణాళికలో అభ్యర్థి ఎంపిక విషయంలో ప్రధానంగా ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంత ఓటర్లపై ప్రభావం చూపాలని భావిస్తున్నారు. ఆ స్థాయిలో అభ్యర్థి ఎవరైతే బాగుంటుందనే దానిపై సమాలోచనలు చేస్తున్నారు. మొన్నటి శాసన సభ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ 2,52,286 ఓట్లు మాత్రమే సాధించి మూడో స్థానంలో నిలిచింది. బీజేపీ 4,48,961 ఓట్లతో రెండవ స్థానంలో నిలువగా, బీఆర్ఎస్ 4,65,476 ఓట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ప్రధానంగా ఎస్టీ రిజర్వుడ్ స్థానాల్లో ఖానాపూర్ మినహా బోథ్, ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ గెలుపొందింది. ఖానాపూర్‌లో గులాబీ పార్టీ రెండవ స్థానంలో నిలిచింది. ఇకపోతే జనరల్ స్థానాల్లో ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో బీజేపీ ప్రభంజనం కొనసాగింది. ఈ నేపథ్యంలో ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంత ఓటర్లపై అభ్యర్థి ప్రభావం చూపాలంటే ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై కాంగ్రెస్ దృష్టి సారించింది. కొత్త అభ్యర్థులైతే సమీకరణాలు ఎలా ఉంటాయి.. ఈ నియోజకవర్గంలో ఇది వరకు పోటీ చేసిన నేతలను బరిలోకి దించితే పార్టీకి ఉపయుక్తంగా ఉంటుందా.. ఇలా అన్ని అంశాలను బేరీజు వేసుకుంటుంది.

**బీఆర్ఎస్ ఓట్లను చీల్చాలి..**

ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో 2019 లోకసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు విజయం సాధించగా, మొన్నటి శాసన సభ ఎన్నికల్లో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపొందగా, ఇక్కడ ఇలాంటి ఎత్తుగడల ద్వారా ఆ పార్టీని నిలువరించాలనే దానిపై కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక చేస్తోంది. లోకసభ ఎన్నికల్లో సమీకరణాలు వేరుగా ఉంటాయని, బీజేపీతోనే కాంగ్రెస్‌కు పోటీ ఉంటుందని పార్టీ అంచనా వేస్తుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఓటును ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సగానికి పైగా చీలిస్తే విజయం దక్కుతుందని పార్టీ భావిస్తోంది. ఇవన్నీ సమీకరణ నేపథ్యంలో గిరిజన తెగల్లో లంబాడా అభ్యర్థిని బరిలోకి దించితే ఎలా ఉంటుంది.. ఆదివాసీ అభ్యర్థి అయితే ప్రయోజనం ఉంటుందా అనే అంశాలను పరిశీలన చేస్తున్నారు. సన్నాహక సమావేశంలో ఇలాంటి అంశాలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టిందని ముఖ్యనేతలు తెలిపారు. అంతే కాకుండా బూత్, మండల, పట్టణ స్థాయిల్లో కమిటీలను పటిష్టపర్చడం, సోషల్ మీడియాను విస్తృత పర్చడం, చేరికలపై దృష్టి సారించడం అనే అంశాలపై ఆ పార్టీ చర్చలు చేసింది. మొత్తంగా అభ్యర్థి ఎంపికపై పార్టీ సీరియస్‌గా దృష్టి సారించింది.

# ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించాలి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, కోవ లక్ష్మి

కాసిపేట: ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించి హక్కులు సాధించుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో కొమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నీతి, నిజాయతీతో ఉద్యమాలు చేస్తేనే హక్కులు సాధించగలమని, కొందరు ఉద్యమాన్ని తాకట్టుపెట్టి ప్రయోజనం పొందాలని చూస్తున్నారన్నారు. తుడుందెబ్బ ఉద్యమం నీరుగారి పోవడానికి కొందరి స్వార్థపు ఆలోచనలే కారణమన్నారు. ఆదివాసీలకు ఓరియంట్ సిమెంట్ కంపెనీతోనే కాకుండా అనేక రకాలుగా అన్యాయం జరుగుతోందన్నారు. ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమించనున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా జాతి మనుగడ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకుంటూ ఏకతాటిపై నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దుగ్గం చిన్నయ్య, ఆత్రం సక్కు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఎంపీపీ రొడ్డ లక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, ఆదివాసీ నాయకులు అడ జంగు, కనక రాజు, హన్మంతు, కాంగ్రెస్ నాయకులు రత్నం ప్రదీప్, సత్యపాల్‌రావు, కొమ్ముల బాపు, కొమురం భీం మనవడు సోనేరావు, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు.

# మాల కులస్తుల ఐక్యతకోసం కృషి

- మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి నర్సింగ్



నియామక పత్రాలు అందిస్తున్న నర్సింగ్

భీమారం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాల కులస్తుల ఐక్యతకోసం కృషి చేస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్ అన్నారు. ఆదివారం భీమారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో ఎక్కువ మెజార్టీ ఉన్న మాలలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ మాలలను చైతన్యపరుస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జైభీం దళ్ మండల అధ్యక్షుడిగా చింతల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కందుగుల రమేశ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో జై భీం సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం, మాల మహానాడు మండల అధ్యక్షుడు దాసరి ప్రకాశ్, జై భీం సైనిక్ దళ్ కమిటీ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్, నాయకులు భూపెల్లి రాజం, సూరమల్ల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# అ'పూర్వ' సమ్మేళనం



మంచిర్యాలఅర్బన్ : ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల డిగ్రీ కళాశాలలో 1975 నుంచి 1995 వరకు విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థుల ద్వితీయ సమ్మేళనం ఆదివారం పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును సన్మానించారు. మొదటి సమావేశంలో ప్రకటించిన కళాశాల అభివృద్ధి నిధులను పూర్వ విద్యార్థులు చెల్లించారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, అధ్యాపకులు చక్రపాణి, కిషన్‌రావు, శేఖర్, వెంకటరెడ్డి, సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్ ప్రిన్సిపాల్ పట్వర్ధన్, టీవీ, సినిమా రచయిత, దర్శకుడు సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 26 ఏళ్లకు మళ్లీ ఒకేచోట కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందించారు.

**పాతికేళ్ల అ'పూర్వ' కలయిక**

జన్నారం: మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యాసంవత్సరంలో పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలలో కలుసుకున్నారు. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులంతా ఒక్కచోట కలుసుకుని పాతజ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాపేశ్వర శర్మ, గంగన్న, కిషన్, మధుసూదన్, శకుంతల, రజిని, సరళ, అంజిత్‌రావు, విజయ్‌కుమార్, రాజమౌళి, లక్ష్మణ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



దండేపల్లి: పూర్వ గురువులతో విద్యార్థులు



జన్నారం: బాలుర పాఠశాలలో పూర్వవిద్యార్థులు

### కోడిపందేల స్థావరంపై దాడి

- రెండు బైక్‌లు స్వాధీనం
- తొమ్మిది మందిపై కేసు

నెన్నెల(భీమిని): కన్నెపల్లి మండలం వీరాపూర్ శివారులో ఆదివారం కోడిపందేల స్థావరంపై దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కల్యాణం నరేష్ తెలిపారు. వీగాంకు చెందిన నన్న రంజిత్, గాండ్ల అంకులు, జక్కులపల్లికి చెందిన పేర లస్మయ్య, అచ్చలాపూర్‌కు చెందిన కొట్లపల్లి రాజంలను అదుపులోకి తీసుకోగా జక్కులపల్లికి చెందిన కోట మహేందర్, బెల్లంపల్లికి చెందిన సత్యం, అచ్చలాపూర్‌కు చెందిన మరిశెట్టి సాయి, భీంపూర్‌కు చెందిన మహేష్, దుబ్బగూడంకు చెందిన మహేష్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న వారి వద్ద నుంచి రెండు బైక్‌లు రూ.3,140 నగదు , రెండు సెల్‌ఫోన్‌లతో పాటు నాలుగు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఆగని పేకాట జోరు..!

- మంచిర్యాల టూ మహారాష్ట్ర
- ఇతర జిల్లాల నుంచి మంచిర్యాల మీదుగా రాకపోకలు
- లాడ్జీలు, క్లబ్‌లు, అటవీ ప్రాంతాలే అడ్డా
- నాయకుల అండతోనే నిర్వహణ



పేకాట రాయుళ్లకు చెందిన వాహనాలు



2023 అక్టోబర్ 19న చెన్నూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.2.51 లక్షల నగదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రాన్ని అడ్డాగా చేసుకుని రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పేకాట దందా జోరుగా సాగుతోంది. ఆటకు బానిసైన కొందరి జీవితాలు వీధిన పడుతున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన సీపీ సత్యనారాయణ జిల్లాలో ఓ పేకాట నిర్వాహకునిపై పీడీయాక్ట్ నమోదు చేసిన ఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది. కొంతకాలం పేకాట కనుమరుగైనప్పటికీ మళ్లీ చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉంది. రాజకీయ నాయకుల అండతో కొందరు వ్యక్తులు ఓ ముఠాగా ఏర్పడి పేకాట నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ ముఠాకు కొందరు పోలీసులు సైతం సహకరిస్తున్నట్లు సమాచారం.

**సరిహద్దు దాటిస్తున్న ముఠా...**

మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని గడ్చిరోలి జిల్లాకు చెందిన ప్రముఖ నాయకుడు అధికారికంగా పేకాట క్లబ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. అతని అండతోనే కొందరు ముఠాగా ఏర్పడి మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో ఏజెంట్లను నియమించుకున్నారు. వారు ఇతర జిల్లాల నుంచి పేకాట రాయుళ్లను మంచిర్యాలకు పిలిపించుకొని ఇక్కడి నుంచి మహారాష్ట్రలోని ఓ పేకాట క్లబ్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. వారికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉండేందుకు, పోలీసులు దాడులు నిర్వహించకుండా ఉండేందుకు, తదితర ఖర్చుల కింద ఒక్కో వ్యక్తి వద్ద నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

**జిల్లాలోనూ అదే దందా...**

జిల్లాలోను అదే దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు సమాచారం. జిల్లాలో ఓ ఇద్దరు పేకాట కింగ్‌ల మధ్య గతేడాది సెప్టెంబర్ 12న జరిగిన వివాదంతో జిల్లా కేంద్రంలోని ఏసీసీ క్వారీ చౌరస్తా వద్ద ఆగిఉన్న ఓ కారును తనిఖీ చేయగా మహారాష్ట్రకు పేకాట ఆడేందుకు వెళ్తున్న ఐదుగురు వ్యక్తుల వద్ద రూ.4 లక్షలు దొరకడంతో పేకాట దందా గుట్టురట్టైంది. జిల్లాలో కొందరు రాజకీయ పలుకుబడి ఉన్నవారు అటవీ ప్రాంతాలు, లాడ్జీలు, ఫంక్షన్ హాళ్లు, నివాస గృహాల్లోనూ స్థావరాలు ఏర్పాటు చేసుకుని కమీషన్ పద్ధతిలో పేకాట నిర్వహిస్తున్నారు. 2023 అక్టోబర్10న హాజీపూర్ మండలం వేంపల్లి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని హాజీపూర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నారు. హాజీపూర్ పోలీసులు పట్టుకున్నారు. అదే నెల 19న చెన్నూర్ సమీపంలోని గోదావరి తీరానా పేకాట ఆడుతున్న 42 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2.51 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని కొన్ని లాడ్జీలు పేకాటకు అడ్డాగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో మందు, విందు, పొందు అన్ని రకాల సౌకర్యాలతో పేకాట రాయుళ్లకు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. అంతే కాకుండా అటవీ ప్రాంతాలు, పంట చేలల్లో, నివాస గృహాల్లో, బహిరంగ ప్రదేశాలను ఎంచుకొని పేకాట ఆడిస్తున్నట్లు తెలిసింది. స్థావరానికి ఇరువైపులా సెల్‌ఫోన్లు పట్టుకుని కాపలాగా ఉంటారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఆయా ప్రాంతాల్లో సంచరిస్తూ కనిపిస్తే వెంటనే నిర్వాహకునికి సమాచారం అందిస్తారు. ఇందుకు వారికి రోజుకు వెయ్యి రూపాయలు, మందు, విందు అన్నీ నిర్వాహకులే చూసుకుంటారు.

**పోలీసుల పాత్రపై అనుమానాలు!**

పేకాట స్థావరాలపై పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు నిర్వహిస్తున్నాయి. నగదు భారీగానే స్వాధీనం చేసుకుంటున్నారు. కానీ దొరికిన మొత్తం కాకుండా తక్కువ చూపేలా మధ్యవర్తుల ద్వారా పేకాట నిర్వాహకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికమొత్తం చూపితే జైలుకు వెళ్లే ప్రమాదం ఉంది. పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినప్పుడు సమాజంలో పలుకుబడి, పేరున్న వ్యక్తులు, లేదా ప్రభుత్వ ఉద్యోగులు దొరికిన సందర్భాల్లో వారిని తప్పించేందుకు రాజకీయ పలుకుబడి ఉన్న వారితో చెప్పించుకుని కేసులు లేకుండా చక్రం తిప్పుకున్న సందర్భాలు ఉన్నాయి. గతంలో జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకుడు, మరో దాడిలో ఓ ఉపాధ్యాయుడు, ఇటీవలి కాలంలో ఓ ఉపాధ్యాయుడు, మిషన్ భగీరథలో పనిచేసే ఓ ఉద్యోగితో పాటు మరికొందరు ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం చర్చనీయాంశమైంది. రాజకీయ పలుకుబడి ఉపయోగించి పోలీసులకు ఎంతో కొంత ముట్టజెప్పి తప్పించుకున్నట్లు ఆరోపణలున్నాయి. పేకాట నియంత్రనకు పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టినప్పటికీ దొరికిన సందర్భాల్లో రాజకీయ నాయకుల ఒత్తిడి పెరగడంతో తలనొప్పిగా మారిందని జిల్లాలోని ఓ పోలీస్ అధికారి ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.

**నిర్వాహకులపై నిఘా..**



పేకాట కేసుల్లో ఉన్న పాత నేరస్తులు, స్థావరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. సిబ్బందిని అప్రమత్తం చేశాం. కమిషనరేట్ పరిధిలో పేకాట, గంజాయి, డ్రగ్స్ తదితర అక్రమాలకు పాల్పడుతున్న వారి సమాచారం అందించి సహకరించాలి. పేకాట నిర్వాహకులపై సైతం కేసులు నమోదు చేయడం జరుగుతోంది.

– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

# రామభక్తిని చాటుకుంటూ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలువురు రాముడిపై భక్తిని వివిధ రూపాల్లో చాటుకుంటున్నారు. నేడు అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా స్థానికంగా పలువురు పలు రకాలుగా తమ భక్తిని ప్రదర్శిస్తున్నారు. స్థానిక రామాలయాలను శుద్ధిచేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే వివిధ ఆకృతుల్లో శ్రీరాముడిని చిత్రీకరిస్తూ అబ్బురపరుస్తున్నారు.

### అట్ట ముక్కలతో అయోధ్య నమూనా

తాంసి: అయోధ్యలో రామ మందిరంలో బాల రాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా పలువురు భక్తులు తమకు తోచిన విధంగా భక్తిని చాటుకుంటున్నారు. తాంసి మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన కర్నేవార్ స్వామి, వరుసకు అల్లుడైనా ప్రవీణ్‌తో కలిసి రాముడిపై ఉన్న భక్తిని ఇలా చాటుకున్నారు. హస్నాపూర్ గ్రామానికి చెందిన స్వామి, ఖానాపూర్‌కు చెందిన ఎన్నావార్ ప్రవీణ్ ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అట్ట ముక్కలు, , థర్మకోల్ పరికరాలతో అయోధ్య రామాలయం నమునాను సిద్ధం చేసి స్థానిక గ్రామంలోని ఆలయంలో ఉంచి భక్తిని చాటుకున్నారు. అయోధ్య నమూనాను తయారు చేసిన యువకులను గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.



మందిర నమూనా చూపిస్తున్న స్వామి, ప్రవీణ్

### శ్రీరామ పాదుకలు చేసి..






వజ్రాచారి

నిర్మల్: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వజ్రాచారి తన రామ భక్తిని చాటుకున్నారు. తన చేతివృత్తితో అద్భుతమైన శ్రీరామ పాదుకలను తయారు చేశారు. టేకు కర్రపై శంకుచక్రాలు, ఏనుగులు, శ్రీరామ ఆయుధాలతో ఆకట్టుకునేలా పాదుకలను రూపొందించారు. వజ్రాచారి గతంలో కర్రతో తయారు చేసిన భారీ కర్ర గణపతి ప్రతిఏడాదీ వినాయకచవితికి పూజలందుకుంటోంది.

### రాములోరి చిత్రాలు

కుంటాల: అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని మండలంలోని కల్లూర్ గ్రామస్తులు పడమర ముఖి హనుమాన్ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రంగులు వేయించి విద్యుత్ దీపాలతో అలంకరించారు. వీరికి తోడు గ్రామానికి చెందిన కళాకారుడు యానంపల్లి నవీన్‌రెడ్డి తనవంతుగా ఆలయ గోడలపై శ్రీరామ, హనుమాన్ చిత్రపటాలను అందంగా వేసి రామ భక్తిని చాటుకున్నాడు.





నవీన్‌రెడ్డి గోడలపై గీసిన శ్రీరాముడు, ఆంజనేయుడి చిత్రాలు

### సేవ చేయడం అదృష్టం...



అయోధ్యలోని శ్రీరామ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఇటీవల గ్రామానికి అక్షంతలు చేరుకున్నప్పటి నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు ఆలయాన్ని అందంగా అలంకరింపజేశారు. నా వంతుగా ఆలయ గోడల పైన చిత్రాలను వేశాను. ఈ చిన్ని సహాయం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా.

– యానంపల్లి నవీన్ రెడ్డి

### కారు, ద్విచక్ర వాహనం ఢీ

- భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు
- కమలాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం

కమలాపూర్: కమలాపూర్ మండలంలోని అంబాల శివారులో ఆదివారం కారు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన బోయిని రవి (50) మృతి చెందగా అతని భార్య లత తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం దంపతులిద్దరూ ద్విచక్రవాహనంపై రామకృష్ణాపురం నుంచి హన్మకొండకు వెళ్లి ఆస్పత్రిలో ఉన్న బంధువులను పరామర్శించారు. అనంతరం తిరుగుప్రయాణంలో కమలాపూర్ మండలం గుండేడులోని బంధువుల ఇంటికి వస్తుండగా అంబాల శివారులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఘటనలో దంపతులిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రవి మృతి చెందాడు. లతను మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై మృతుని సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వీరస్వామి తెలిపారు.